# మరణం అంచున మందహాసం

ట్రెయిన్ చాలా వేగంగా వెడుతోంది.

లయబద్ధమైన దాని చక్రాల చప్పుడును బయట ఉధృతంగా ఉన్న గాలి, వర్షపు హోరు మింగేస్తోంది. వాన, గాలి - పున్నమి నాగుల్లా పెనవేసుకుపోయి ప్రకృతి రంగస్థలం మీద ప్రళయ నృత్యం చేస్తున్నట్టుగా ఉంది.

ఆ పెట్టెకున్న కిటికీలన్నీ మూసినా మాధవరావు కూర్చున్న కిటికీ మాత్రం తెరిచిపెట్టుకున్నాడు. వర్షాన్ని చూడ్డం అన్నా, వర్షంలో తడుస్తున్నట్లు కనిపించే ప్రకృతిని చూడ్డమన్నా మాధవరావుకు మహా ఇష్టం. గాలి వాలు ఆ కిటికీవైపు లేకపోవడంవల్ల వాన జల్లు ఎప్పుడో కాని ఇటు రావడంలేదు.

ఎప్పుడో ఒకసారి గాలి విసురుకు మీద పడుతున్న వానజల్లు హాయి హాయిగా, చల్ల చల్లగా అనిపిపోస్తంది మాధవరావుకు.

ఆ కాస్త వానజల్లు కూడా సహించలేకపోతున్నట్లుగా మాధవరావు ఎదురు బెర్త్ మీద కూర్చున్నాయన ముఖం చిట్లించి, "అబ్బా! వర్షంమీద పడుతోంది సార్! కిటికీ మూసేయండి" అన్నాడు.

"కిటికీలన్నీ మూసే వున్నాయి కదా, ఇది కూడా మూసేస్తే బొత్తిగా ఊపిరాడనట్లుగా అయిపోతుంది" అని బయటకు చూడసాగాడు మాధవరావు.

వర్షంలో తడుస్తున్న ప్రకృతి తెల్లని మేలి ముసుగు వేసుకున్నట్లుగా వుంది. చెట్లు, గుట్టలు, టెలిఫోన్ స్తంభాలు త్వర త్వరగా వెనుకబడిపోతున్నాయి.

రైలు కృష్ణాబ్రిడ్జిని సమీపిస్తోంది.

మాధవరావు పక్కన కూర్చున్న ఒక నడివయసాయన దిగ్గున లేచి, "అరే, భూమ్యా! లేరా! క్రిష్ణానది వచ్చింది. పైసలేసి నీ ఆరోగ్గెం తొందరగ బాక్కావాలని గంగమ్మ తల్లికి దండం పెట్టుకుందువురా!" సీట్ల కింద పడుకున్న ఒక యువకుడిని తట్టి లేపాడు. "నీవు రారా లచ్చుడు!"

లేపిన వాడి ముఖం కాయకష్టంతో బండబారినట్లుగా వుంది. అతడి శరీర సౌష్ఠవం, రాగి రంగుజుట్టు లంబాడి అని చెప్పక చెపుతున్నాయి. రెండు చెవులకు బంగారు పోగులున్నాయి. కుడి ముంజేతికి వెండి కడియం వుంది. ముతకపంచె మోకాళ్ళ మీదికి గోచీ పోసి కట్టుకొన్నాడు. ఎర్రటి సెల్లా ఒకటి తలకి చుట్టుకున్నాడు.

ఎవరైనా నిశితంగా గమనిస్తే అతడి కళ్ళల్లో గూడు కట్టుకొన్న కాఠిన్యం కనపడేది. లేచినవాడు ఎముకల పోగులా వున్నాడు. అతడి శరీర వర్ణమూ రాగిరంగులో వుంది కానీ జీవం లేనట్టుగా పాలిపోయింది. ఆ ఎముకల గూడులో జీవం గాలికి రెపరెపలాడే దీపాన్ని గుర్తుకు తెస్తోంది.

"అప్పుడే కిష్ణొచ్చిందా, మామా?" నీరసంగా అడిగాడు.

"తొందరగా లే! బ్రిడ్జి దాటిపోతోంది!"

నడివయసువాడు తొందరజేస్తూ భూమ్యా చెయ్యిపట్టి బలంగా పైకి లేపుతుంటే లక్ష్మణ్ అని పిలువబడ్డ యువకుడు బెర్త్ మీద లేచి మరో వైపు చెయ్యిపట్టుకున్నాడు.

ఇద్దరూ కలసి అతడిని డోర్ దగ్గరికి లాక్కుపోయినట్టుగా నడిపించుకుపోయి డోర్ తెరిచారు. గాలీ, గాలితోపాటు వర్షం రౌడీ గాంగ్‌లా చప్పున లోపలికి చొరబడ్డాయి.

"అరే! తలుపెందుకు తీశారు? లోపలకి వాన నీళ్ళు ఎలా వస్తున్నాయో చూశారా? మూయండి, మూయండి!" బెర్తుల మీద కూర్చున్న వాళ్ళు అరిచారు.

"మూస్త, మూస్త!" నడివయసు వాడు జేబులోంచి చిల్లర నాణాలు తీసి ఒక నాణెం భూమ్యాకి, మరొక నాణెం లక్ష్మణ్‌కి ఇచ్చాడు. తనొకటి తీసుకున్నాడు. 'ఎయ్‌రా!'

దబ్బుమన్న శబ్దం గాలివాన హోరులో కలిసిపోయింది.

కంగారుగా దిగ్గున లేచాడు మాధవరావు. "ఏయ్! ఏమిటి? మీరు చేసిన పని?" డోర్ దగ్గరకి పరిగెత్తి వాళ్ళని పక్కకి తోసి, బ్రిడ్జి కింద పరవళ్ళు, ఉరవళ్ళతో బిరబిరా కదిలిపోతున్న కృష్ణమ్మలోకి భయవిహ్వలంగా చూశాడు.

ఆనవాళ్ళు కూడా మిగల్చలేదు.

ఏమీ ఎరగనట్టుగా అమాయకంగా వెళ్ళిపోతోంది కృష్ణమ్మ.

విసురుగా వచ్చిపడుతున్న వానజల్లుకు ఆ ఇద్దరే కాదు, మాధవరావు కూడా పూర్తిగా తడిసిపోయాడు. "ఏం పని చేశారయ్యా? అతడిని నదిలోకి ఎందుకు తోసేశారు?"

అతడి అరుపులకు నిద్రలో జోగుతున్న వాళ్ళు, ఏదో కబుర్లతో మునిగిపోయిన వాళ్ళు ఉలికిపాటుతో ఇటు తిరిగారు "ఏం జరిగింది?"

"వీళ్ళు... వీళ్ళు... హంతకులు! ఇంత వరకు ఇక్కడ మన కాళ్ళ దగ్గర పడుకొన్న సుస్తీ మనిషిని లేపి, డోర్ దగ్గరకి తీసుకుపోయి నేను చూస్తుండగా ఆ ఇద్దరూ అమాంతం ఎత్తి నదిలోకి విసిరేశారు. అంతా రెప్ప పాటులో జరిగిపోయింది."

చాలా దూరం నుంచి తల కింద రుమాలు చుట్టలా పెట్టుకుని ముడుచుకు పడుకున్న ఒక బక్క పలుచటి వ్యక్తి ఇప్పుడు లేకపోవడం అందరూ గమనించారు.

కాళ్ళకు తగులుతూ దారిలో పడుకొన్నారు. జబ్బుచేసిన వ్యక్తి కాబోలు పాపం అని ఎవరూ ఏమీ అనకుండా ఊరుకున్నారు. ఈ గడబిడతో తనకేం సంబంధం లేనట్టుగా రైలు బ్రిడ్జిని దాటిపోయింది.

నడివయసువాడు తలకున్న సెల్లా తీసి నోట్లో కుక్కుకొని ఏడవసాగాడు. "మేమెందుకు తోస్తం సామీ? ఆడే... పైసలు ఏట్లకి ఇసరబోయి దూకిండు!"

"అబద్ధం" ఆవేశంతో, కోపంతో మాధవరావు ముఖం ఎర్రబడిపోయింది. "తూలిపడలేదు. మీరే... చెరో పక్కన వాడి చంకల కింద చేతులు వేసి పైకెత్తి బంతిని విసిరినట్లుగా ఏట్లోకి విసరడం నా కళ్ళతో నేను చూశాను."

"లేదు సామీ! ఆడు నా అల్లుడు! నా బిడ్డ మొగుడు! సేజేతులా ఆణ్ణి నేనెందుకు ఏట్లకు తోస్త?"

"అరే నా కళ్ళతో నేను చూస్తే!"

"ఎట్ల చూస్తివో, ఏం జూస్తివో గాని ఆడే తూలిండు!"

"తూల లేదు, బావా! ఆడు పానం ఇసిగి ఏట్ల దుంకిండు. తనకొచ్చిన జబ్బు నయమయ్యేది కాదని తెలిసింది కదా!" లక్ష్మణ్ అన్నాడు.

తను కళ్ళారా చూసిన హత్యను అందరూ నమ్మాలన్నట్లుగా ఆ సంఘటనను మళ్ళీ మళ్ళీ వర్ణించి చెప్పాడు మాధవరావు. ఆ బక్క మనిషిని వీళ్ళు రెండు చేతులతో ఎలా ఎత్తారో, ఎలా బయటకి విసిరేశారో అభినయించి చూపాడు. "వీళ్ళు హంతకులు, అబద్ధం చెపుతున్నారు. వచ్చే స్టేషన్‌లో వీళ్ళను పోలీసులకు పట్టిస్తాను. వాళ్ళే తేలుస్తారు వీళ్ళ సంగతేమిటో!"

"తోశారో, వాడే దూకాడో మీకెందుకండీ? విచారణ పేరుతో మిమ్మల్ని వందసార్లు తిప్పుతారు పోలీసులు! మీరుండేది హైదరాబాద్‌లో అన్నారు కదా? అక్కడి నుంచి ఇక్కడికి ఎన్ని పనులున్నా విడిచిపెట్టుకొని తిరగాలి! ఎందుకొచ్చిన న్యూసెన్స్ అండి మీకు? గమ్మునుండండి. పాపం పుణ్యం భగవంతుడు చూస్తాడు గాని!" ఒక అనుభవజ్ఞుడు చనువు తీసుకొని మందలించడంతో, పాలపొంగుమీద నీళ్ళు చల్లినట్లుగా మాధవరావు ఆవేశం అణగారిపోయింది.

"ఏ ఊరు మీది? ఎక్కడి నుంచి వస్తున్నారు?" ఎవరో అడిగారు నడివయసాయన్ని.

"పాలమూరు దగ్గర పాటిగడ్డతండా లంబడోళ్ళం సామి. ఏట్ల పడి సచ్చినోడు నా అల్లుడండి. నా బిడ్డనిచ్చిన. పెండ్లయ్యి అయిదేళ్ళయ్యింది. వాడు లారీ మీద పని చేస్కుంట బొంబాయిల వుండే. రెండు రోజులనాడు లారీ ఓనరు లెటరేసిండు. 'నీ అల్లునికి పానం అస్సలు బాలేదు. వచ్చి తోల్కబోండని. నేను... ఈడు నా బామ్మర్ది. ఇద్దరం ఎల్లినం. డాక్టర్లు బతకడని చెప్పిండ్రు. ఇంటికి తోల్కపోండ్రి అని చెప్పిండు లారీ ఓనరు. అందుకనే ఆణ్ణి ఇంటికి తోల్కపోతున్నమయ్యా. ఎట్ల బతకను.. ఇంటికి బోయి ఏం చెయ్యాల అనుకున్నడో ఏమో, ఏట్ల దూకిండు. ఈ సంగతి ఇంట్ల నా బిడ్డకు ఎట్ల ఎర్క జేయాల్నో ఏమో?" కళ్ళొత్తుకున్నాడు నడివయసాయన.

"ఇంతకు ఏమిటి జబ్బు?" మాధవరావు అడిగాడు.

"అదేదో ఈ మద్దెన్నే కొత్తగా ఇంటున్నమండీ! ఎయిడ్సో ఏదో చెప్పిండ్రు. ముండలతోని పోతే తగుల్కునే రోగమంట. పెండ్లాన్ని ఇంటికాణ్ణే వుంచి ఒక్కడు లారీమీద పోతుండే. ఏలం... తానికి పోయి తగిలించుకున్నడో ఆ మాయదారి రోగం!"

"ఇదండీ మన భారతదేశ చరిత్ర! పైకి ఎంత గొప్పగా చెప్పుకుంటేనేం? లోపల అంతా లుకలుక! ఈ తండాల వాళ్ళకీ, మారుమూల గ్రామాల వాళ్ళకీ ఈ జబ్బు పేరేంటో కూడా తెలియదు సరిగ్గా. దాని లక్షణమేమిటో తెలియదు. అదేదో

మాయదారి రోగమని, వాళ్ళని ముట్టుకుంటే, ఆ జబ్బు తమకంటుకొని చచ్చిపోతామని... రకరకాల మూఢనమ్మకాలతో పీడింపడుతున్నారు వీళ్ళు. ఆ మనిషిని ఇంటికి తీసుకుపోతే ఆ జబ్బేదో తమకీ అంటుకుంటుందని... రిస్క్ ఎందుకు తీసుకోవాలని... ఇలా వదిలించుకొన్నారన్నమాట. ఒక నిండు ప్రాణాన్ని నిండు ఏట్లో పడేశారు. పైగా, తిరగలేక, చస్తానని నన్ను నిరుత్సాహపరుస్తున్నారాయే! నా పౌర ధర్మం నిర్వహించలేకపోయానన్న బాధ నన్ను జీవితమంతా వెంటాడుతుంది!" బాధ వ్యక్తం చేశాడు మాధవరావు.

"సుఖంగా, ప్రశాంతంగా జీవించాలనుకొన్న వాళ్ళు వాస్తవంతో సహజీవనం చెయ్యాలి సార్! పౌరధర్మమని, ఆదర్శాలని... అదని ఇదని అనవసరంగా చిక్కుల్లో పడాల్సి వస్తుందని చెప్పాను. నాది సలహా మాత్రమే! వినడం, వినకపోవడం మీ ఇష్టం కదా?"

✧ ✧ ✧

తాము బొంబాయి వెళ్ళే సరికే భూమ్యా చచ్చిపోయాడని, ఊరికి శవాన్ని తీసుకురావడానికి జీపువాళ్ళు ఎక్కువ డబ్బు డిమాండ్ చేస్తే తమ వద్ద లేక అక్కడే బొందపెట్టి వచ్చామని చెప్పాడు భూమ్యా మామ రామా నాయక్ భార్యకీ, బిడ్డకే కాదు తండా వాళ్ళకీ అదే చెప్పాడు!

ఆరు నెలల తరువాత సంగతి...

భూమ్యా భార్య సోనుబాయ్ సిమెంటు తట్ట తలమీద మోస్తూ కళ్ళు తిరిగి నిచ్చెన మీద నుంచి పడిపోయింది. అంత మీద నుంచి కిందపడుతూనే చేయి బూరెలా వాచిపోయింది.

ఆమెకు ఇరవై నిండలేదింకా. పధ్నాలుగేళ్ళకే భూమ్యాతో పెళ్ళయిపోయింది. చిన్న వయసులోనే భర్తను పోగొట్టుకున్న దిగులు ఆ కళ్ళల్లో గూడుకట్టుకొన్నట్లుగా వుంటుంది.

సోను ఎర్రగా రివటాలా వుంటుంది. ఎవరితో ఎక్కువ మాట్లాడదు. తన పనేమో, తనేమో!

పడగానే హాస్పిటల్‌కి తీసికెళ్ళి డాక్టర్‌కి చూపిస్తే ఏమయ్యేదోగాని ఎవరో పసరు మందు పోస్తారంటే పోయించింది తల్లి గౌరి. దెబ్బతగిలిన చోట చెట్ల పసరు పూసి,

ఆకులు వేసి కట్టుకట్టారు. వారం రోజులు గడిచేసరికి చెయ్యి వాపు తగ్గకపోగా పోట్లు, మంటలూ ప్రారంభమయి ఏడుపు మొదలుపెట్టింది సోనూ.

తండాకి పాఠాలు చెప్పడానికి వచ్చే ప్రసాద్ అన్న యువకుడు సోనూని చూసి, "మీరిలాగే నాటు మందుల మీద ఆధారపడితే చెయ్యి తీసెయ్యాల్సిన పరిస్థితి వస్తుందేమో! చెయ్యి అంత లావు వాచిందంటే లోపల ఎముక ఫ్రాక్చర్ అయిందేమోనని నా అనుమానం! నా మాట విని ఆమెని తీసికెళ్ళి డాక్టర్‌కి చూపించండి." అని సలహా ఇచ్చాడు.

ఆ మాట నిజమేననిపించింది గౌరికి. కూతుర్ని తీసుకెళ్ళి డాక్టరుకి చూపించింది.

సోనూ చేతికున్న ఆకుపసరూ అదీ చూసి ఆగ్రహంతో కేకలు వేశాడు డాక్టరు. "ఆకు పసర్లకి విరిగిన ఎముకలు అతుక్కుంటాయని ఎవరు చెప్పారు? ఈ వాపు, ఈ నొప్పిచూస్తే మోచేతి దగ్గర ఎముక ఫ్రాక్చరయినట్లుంది. వెంటనే సిమెంటు పట్టి వేస్తే ఇదివరకంతా ఎముక అతుక్కునేది. ఇప్పుడు మాత్రం లోపలంతా సెప్టిక్ అయి పూర్తిగా చెయ్యి తీసెయ్యాల్సిన పరిస్థితి వచ్చిందేమోనని నా అనుమానం?"

తల్లీ కూతుళ్ళు గొల్లుమన్నారు.

"కష్టం చేస్కోని బతికేటోళ్ళం దొరా... చెయ్యి తీసేస్తే ఎట్ల కష్టం చేస్తది? ఎట్ల బతుకుతది?" అంటూ సోనూకు భర్త పోయిన సంగతి, తమ కుటుంబ పరిస్థితి చెప్పుకొచ్చింది గౌరి.

"చెయ్యి తీసెయ్యకపోతే మనిషే పోతది కదా? పోనీ మరి?"

"అయ్యో, నా బిడ్డా! చెయ్యి పోతే ఎట్ల బతుకుతవే, బిడ్డా!" బిడ్డను కౌగిలించుకొని ఏడవసాగింది గౌరి.

"నీ బిడ్డ చెయ్యి తీసేయాలని నాకేం సరదా లేదు. ఎక్స్‌రే తీయిస్తాను. ఆపరేషన్ చేసి 'రాడ్' వేస్తే సరిపోతుందా? చెయ్యి తీసేయాలా? అన్నది పరిస్థితిని బట్టి నిర్ణయిస్తాను."

సోనూ చేతిని ఎక్స్‌రే తీయించాడు డాక్టరు. మోచేతి దగ్గర ఎముక ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. చెయ్యి కొట్టేయాల్సినంత ఇదేం లేదని, ఆపరేషన్ చేసి రాడ్ వేస్తే సరిపోతుందని చెప్పాడు. ఎంత డబ్బు ఖర్చు అవుతుందో కూడా చెప్పాడు.

మరునాడు డబ్బు తీసుకొని, పిల్లను తీసుకొని వచ్చింది గౌరి.

ఆపరేషన్ ముందు చెయ్యాల్సిన పరీక్షలు.. బ్లడ్ టెస్ట్, యూరిన్ టెస్ట్, షుగర్ టెస్ట్ చెయ్యాల్సిన పరీక్షలన్నీ చేయించాడు డాక్టరు. గంట తరువాత రిపోర్ట్స్ చూసిన ఆయన అదిరిపోయాడు. "ఆ పేషెంటును, వెంటనే హాస్పిటల్ నుంచి పంపించేయండి. ఇక్కడ ఆపరేషన్ చేయడానికి కుదరదని చెప్పు."

"ఎందుకంటే ఏం చెప్పాలి సార్?" కాంపౌండర్ అడిగాడు.

"ఆపరేషన్ చేసినా ఆవిడ బతికేది ఆరునెలలో, ఏడాదో! ఆవిడకి హెచ్ఐవి సోకింది. చిన్న వయసులో భర్త పోయాడు కదా? ఏం ఆటలాడిందో... ఎంత మందితో పోయిందో...."

ఆ రిపోర్ట్స్ అన్నీ తీసుకుపోయి గౌరి చేతిలో పెట్టి చెప్పాడు కాంపౌండరు. "నీ బిడ్డకు ఇక్కడ వైద్యం జరుగదు. డాక్టరుగారు బిజీగా వున్నారు. మిమ్మల్ని వెళ్ళిపోమన్నారు!"

"ఎకా ఎకిన ఎందుకిట్ల చెప్తున్నరు సారూ? డబ్బు తీస్కరా నీ బిడ్డకు ఆపరేషన్ చేస్తానంటే షావుకారు తాన మిత్తీకి డబ్బు తెస్తి. రక్త పరీక్ష, మూత్ర పరీక్ష.. ఇంకా ఏవేవో పరీక్షలు చేస్తిరి కద సారూ? ఇప్పుడిట్ల ఎందుకు మాట్లాడుతున్నరు?"

"ప్రశ్నలేసుకుంటూ కూర్చోకు. ఇంకేదైనా హాస్పిటల్‌కి తీసుకుపో! ఆమెకిక్కడ వైద్యం జరగదంటే జరగదు."

"నేను దొరనే అడుగుత. ఎందుకు ఆప్రేషన్ చెయ్యడో! పిల్లనొప్పికి పానం పొయేట్టు ఏడుస్త వుంటే మీకు తమాషైనట్టుంది"

గౌరి కోపంగా డాక్టరు దగ్గరికి వెళ్ళబోతుంటే, "డాక్టరు దగ్గరకి ఎందుకు? నేను చెప్తారా!" అంటూ విషయం చెప్పాడు కాంపౌండరు. "బ్లడ్ టెస్ట్‌లో నీ బిడ్డకు హెచ్ఐవి వుందని తేలింది. హెచ్ఐవి పేషెంట్లకు మా డాక్టరుగారు ట్రీట్‌మెంట్ చేయరు."

"అదేం రోగం, సారూ?"

"చెప్పా కదా హెచ్ఐవి అని!"

"గదెప్పుడు వినలే!"

"ఇది సాధారణంగా సెక్స్ వర్కర్లకి వచ్చే జబ్బు. భర్తకి ఈ జబ్బు వున్నా భార్యకి వచ్చే అవకాశముంది. ఆమె భర్త ఏం చేస్తుంటాడు?"

"భర్త చచ్చి ఆరునెలలవుతూంది సారూ! వాడు బొంబైల పని చేస్తుండే! లారీ మీద పోతుండే! వాడు ఏదో మాయదారి రోగమొచ్చి చచ్చిండు."

"అదే రోగం నీ బిడ్డకు అంటించి చచ్చినట్లున్నాడు. మీరు కొంచెం ఆమెతో జాగ్రత్తగా వుండండి. ఎందుకైనా మంచిది ఆమెను దూరంగా వుంచండి. ముట్టుకుంటే ఏం కాదంటారు గాని మీ జాగ్రత్తలో మీరుంటే మంచిది కదా?" రోగలక్షణాలు చెప్పాడు కాంపౌండరు. ఇక కొన్ని నెలలే ఆమె బతికేది. నీరసించి నీరసించి చివరికోనాడు..." కళ్ళు మూసి నాలిక బయటకి పెట్టి పైకి చూపాడు చేతిని.

"మీ డాక్టరు ఆ రోగానికి మందీయడా?" అమాయకంగా అడిగింది గౌరి.

"ఈ రోగానికి ఇంకా మందు కనిపెట్టలేదెవరూ!"

✧ ✧ ✧

"ఆసరా!"

ఎయిడ్స్ భూతం మీద పోరాటం సాగిస్తున్న ఒక స్వచ్ఛంద సేవా సంస్థ!

ఆ సంస్థ కన్వీనర్ దీపిక గ్రామ గ్రామానికీ తిరుగుతూ ఆ రోజు పాటిగడ్డ తండాకి వచ్చింది. ఏ ఊరికి వెళ్ళినా ఆ ఊరి పెద్దనో, సర్పంచ్‌నో కలవడం, ఆ ఊరి మంచి చెడ్డలు చర్చించడంతో పాటు ఎయిడ్స్ పేషెంట్లు ఎవరైనా ఉన్నారేమో కనుక్కొని, వాళ్ళని తీసుకొని పోయి హాస్పిటల్లో అడ్మిట్ చేసి ట్రీట్‌మెంటు ఇప్పించడం, వాళ్ళకి ధైర్యాన్ని నూరిపోయడం, లక్ష్యంగా పెట్టుకొన్న దీపిక ముందుగా తండా పెద్ద మెగావత్ నారాయణ ఇంటికి వెళ్ళింది. నారాయణ డెబ్బై ఏళ్ళ పైబడిన వృద్ధుడు. తండాలో ఎవరికి ఏ గొడవొచ్చినా, కోర్టులకీ, పోలీసు స్టేషన్లకీ పోకుండా ఆయనే వాళ్ల సమస్యలను పరిష్కరిస్తూంటాడు. ఆయన ఏ తీర్పు ఇచ్చినా తండా వాళ్ళు సంతోషంగా శిరసావహిస్తుంటారు.

ఆ తండాకి వచ్చిన ఏ అధికారి అయినా ముందుగా కలిసేది ఆయన్నే. ఈ రోజు దీపిక కూడా ఆయన్నే కలిసింది. ఎయిడ్స్ మీద పోరాటం సాగిస్తున్న సంస్థగా తమ 'ఆసరా'ని పరిచయం చేసుకుంది.

నారాయణకి కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. "శానా మంచి టైంకి వచ్చినావు తల్లీ! సోనూ బాయికి ఏందారి చూపాల్నా అని నిన్నటి నుంచి తల బద్దలు కొట్టుకుంటున్నా! దేవుడు పంపినట్లు వస్తివి!"

"సోనూ బాయి ఎవరు?"

"అమ్మా... సోనూ..." లోపలికి కేకేశాడు నారాయణ.

లోపల నుంచి సోనూ వచ్చింది. వాచిపోయిన చేతిని రాసుకుంటూ, బాధకి మూలుగుతూ...

"అరే! చెయ్యి బాగా వాచిపోయిందే! ఏమైంది?" దీపిక అడిగింది.

"ఇది మా తండా పిల్లనే. పేరు సోనూబాయి. రామానాయక్ గౌరీల బిడ్డ. దీని మొగుడు ఆరు నెల్ల కింద ఎయిడ్స్ జబ్బుతో బొంబాయిల పనిచేసేటోడు చచ్చిపోయిండు. ఇది కూలి పని చేసుకుని బతుకుతోంది. వారం రోజుల కింద పనిచేసే చోట నిచ్చెనమీద నుంచి కిందపడి చెయ్యి విరగ్గొట్టుకుంది". డాక్టరు ఆపరేషన్ చేస్తానని చెప్పి చెయ్యకుండా వెళ్ళగొట్టడం, అదంతా చెప్పాడు. "తల్లేమో దీనికి వైద్యం చేయించకుండా ఎట్లా చచ్చేదే కదాని తిండిపెట్టకుండా గొడ్ల కొట్టంలో పడేసి, పురుగుల మందు నోట్లోపోసి చంపడానికి చూసింది. ఇది ఎట్లనో తప్పించుకొచ్చి నా కాళ్ళు పట్టుకొంది. నేను దీనికి అభయమిచ్చినా గాని ఏం చెయ్యాల్నో తెలుస్తలేదు."

"సోనూ బాధ్యత ఈ క్షణం నుంచి నాది, తాతా!" దీపిక సోనూ ముఖంలోకి ఆప్యాయంగా చూసి చిరునవ్వు నవ్వింది.

మృత్యువు తరుముతున్న మనిషి ముఖంలో కనిపించే దైన్యం, భయం సోనూ కళ్ళల్లో కనిపించాయి ఆమెకు.

"నాకు చచ్చిపోవాలని లేదమ్మా. నాకు బతకాలని వుంది. నన్ను బతికించమ్మా" అంటూ దబ్బున దీపిక కాళ్ళమీద పడింది సోనూ.

"లే! లేచి ఇలా కూర్చో. బతకాలన్న నీ కోరికే నిన్ను బతికిస్తుంది." సోనూ భుజాలు పట్టి లేపింది దీపిక.

"ముందు నువ్వు చావంటే భయపడడం మానెయ్యి. చావంటే ఎందుకు భయపడేది? భయపడితే వచ్చేది రాకుండా వుండదు కదా? చావు నీకే కాదు. నాకూ, ఆ నారాయణ తాతకు, నీ చేత పురుగుల మందు తాగించి చంపాలనుకున్న మీ అమ్మకూ అందరికీ వస్తుంది. కొంచెం వెనకా ముందు.. కొన్నాళ్ళ తరువాత ఇప్పుడున్న వాళ్ళెవరం వుండం. కొత్త వాళ్ళుంటారు. ఈ నిజం నువ్వు తెలుసుకుంటే ఇక భయపడవు. ఈ ప్రపంచంలో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటో తెలుసా? ఏదో

ఒకనాటికి చచ్చేవాళ్ళమని తెలిసినా ఆ సంగతి పూర్తిగా విస్మరించి మాయలో పడిపోతాడు మనిషి. పెళ్ళి చేసుకుంటాడు. పిల్లల్ని కంటాడు. వాళ్ళకోసం ఆస్తుల్ని పోగేస్తాడు. చివరికి పూచికపుల్ల కూడా వెంటతీసుకుపోకుండా చివరికి ఎంతగానో ప్రేమించే తన శరీరాన్ని కూడా తీసుకుపోకుండా పోతాడు. ఇంత తాపత్రయం ఏదో ఒకనాటికి పోయే మనిషికి అవసరమా నాకనిపిస్తూ వుంటుంది. కాని మనిషికి ఇలాంటి నిరాశావాదం కూడా పనికిరాదనుకో! నిరాశకు చోటిస్తే మనస్సంతా కార్యశూన్యత ఆవరిస్తుంది. ఎందుకూ పనికిరాకుండా అయిపోతాం. నిరాశవద్దు కాని, వాస్తవం తెలిసి వుండాలని చెబుతున్నాను. పిరికితనం వద్దు. చావు ముందైనా సరే... దేని ముందైనాసరే.... మనం బలహీనులం అనుకుంటే బలహీనులమైపోతాం! బలవంతులం అనుకుంటే బలవంతులమైపోతాం. అంతా మన చేతిలోనే వుంది. ఆత్మవిశ్వాసం పెంచుకో. నీలోని శక్తిని తెలుసుకో! నువ్వు సంకల్పిస్తే ఏదైనా చేస్తావు. చేయగలవు నాతో కలిసి పనిచెయ్యి. సోనూ అంటే సోనూ కాదు. ఒక ఉద్యమంగా రూపుదాల్చాలి. ఈ రోజు నా 'ఆసరా' చూసుకొని నీకెలా ధైర్యం వచ్చిందో, రేపు నీ 'ఆసరా' చూసుకొని పదిమంది ధైర్యం తెచ్చుకోవాలి. నీలాంటి వాళ్ళు నీ నుండి స్ఫూర్తి పొందే స్థాయికి నువ్వు ఎదగాలి!" మృదువుగా చెప్పింది దీపిక.

"నేను బతుకుతనా అమ్మా? ఈ రోగం వచ్చిన వాళ్ళను బతికించే మందులు లేవంట గదా?" దీనంగా అడిగింది సోనూ.

"బతికించే మందులు లేవు కానీ, జీవితకాలాన్ని పెంచే మందులున్నాయి. సరైన ఆహారం, సరైన మందులు వేళకు వాడుతూ వుంటే రోగం అదుపులో వుండి, జీవితకాలాన్ని పెంచుకోవచ్చు. చస్తానని ప్రతిక్షణం చావు భయంతో వణికిపోతుంటే మాత్రం ఆ భయమే నీ ఆయువును హరించి మృత్యువుకు చేరువ చేస్తుంది. చావంటే భయం వద్దు. దేనికి భయం? నేను భయపడుతున్న? నాకు బ్లడ్ క్యాన్సర్. నీ జబ్బుకు మందులు కనిపెట్టనట్టే నా జబ్బుకూ మందులు కనిపెట్టలేదు... నాకున్నటైం కొంచెమే అని తెలిశాక ఈ ప్రజలకు నేనేమైనా చేసి పోవాలనిపించింది. వీలైనంత ఎక్కువ సేవ చేయాలన్న పట్టుదల నన్ను ఊరూరూ తిప్పుతోంది. 'నేను బతుకుతనా?' అని అడుగుతున్నావు కదా? ఇది జీర్ణ వస్త్రం. ఎన్నాళ్ళు దీన్ని పట్టుకొని వేళ్ళాడతాం? కొత్త వస్త్రం ధరించడానికి మనం సమాయత్తం కావలసిన టైం మనకు ముందుగానే వచ్చేస్తోంది! అంతే!"

✧ ✧ ✧

ఆ రోజు 'ఆసరా' మీటింగ్ నడుస్తోంది.

వేలాది జనం ఉన్న సభలో మైకు ముందు నిలబడి ఉద్వేగ్నంగా ప్రసంగిస్తోంది సోనూబాయి!

"... ఎయిడ్స్ రోగులకు మీ నుండి కావలసింది కొంచెం ఆదరణ! ఆత్మీయమైన చిన్న పలుకరింపు! అవే వాళ్ళకి ఆరోగ్యాన్నిస్తాయనీ, ఆయువును పెంచుతాయని మరువకండి. ఎయిడ్స్ రోగులూ మనుషులే! వాళ్ళకీ మనుస్సుంటుంది. బతకాలన్న కోరిక వుంటుంది. వాళ్ళనీ మీలో ఒకరిగా బతకనీయండి. వాళ్ళని తాకితే వాళ్ళ జబ్బు మీకు రాదు. వాళ్ళతో సంపర్కం పెట్టుకుంటే మాత్రం వస్తుంది. ఎయిడ్స్ రోగి అయిన నా భర్తవల్ల నేనూ ఎయిడ్స్ రోగినయ్యాను. త్వరలో నేను చచ్చిపోతానని తెలిసినప్పుడు చాలా భయపడ్డాను. ఏడ్చాను. మా అమ్మ నన్ను గొడ్లకొట్టంలో పడేసి ఎండ్రిన్ తాగించి చంపబోయింది. ఆ సమయంలో దీపికా మేడమ్‌గారు నా జీవితంలోకి వచ్చారు. చావుని చూసి భయపడాల్సింది లేదని చెప్పారు. చదువూ సంధ్యా లేని నన్ను అక్షరాస్యురాల్ని చేశారు. మనిషిగా తీర్చిదిద్దారు. దీపికా మేడమ్‌గారు వెలిగించిన వందలకొద్దీ దీపకళికల్లో నేనొక చిరుదివ్వెని. ఈ వెలుగులో పదిమంది ధైర్యాన్నీ, స్ఫూర్తినీ పొందాలని ఆమె కోరిక! 'ఇది జీర్ణవస్త్రం. ఎన్నాళ్లు దీన్ని పట్టుకొని వేళ్ళాడతాం? కొత్త వస్త్రం ధరించడానికి సమాయత్తం కావాలి' అంటుండేవారు. అన్నట్లే ఆమె ఎంతో సంతోషంగా కొత్త వస్త్రం ధరించడానికి వెళ్ళిపోయారు. ఆమె ఇప్పుడు మా మధ్య లేకపోయినా ఆమె ఆశయాలనీ, 'ఆసరా'ను ముందుకు తీసుకుపోవడానికి నా వంతు నేను కృషి చేస్తున్నాను. ఒకనాడు చావంటే భయంతో వణికిపోయిన నేను చావు గురించి మరిచిపోయి చాలా రోజులయింది. నాకు గుర్తుండేది ఇప్పుడు పని ఒక్కటే. 'ఆసరా'ని ముందుకు తీసుకుపోవడం ఒక్కటే..."

సభికుల కరతాళ ధ్వనుల మధ్య సోనూబాయి ఉపన్యాసం అనర్గళంగా కొనసాగుతూనే వుంది.

*నవ్య వారపత్రిక, 28 నవంబర్ 2007*

◆